క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వాతినక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2011 మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.

ఫంక్షన్ హాలు ప్రారంభం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో ఎన్.హుసేన్ వల్లి నిర్మించిన ఎన్‌హెచ్‌వీ ఫంక్షన్ హాలును ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి శనివారం ప్రారంభించారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోదకొట్టం దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బద్వేలు అర్బన్ : మండల పరిధి కోన సముద్రం గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బోదకొట్టం దగ్ధమైంది. గ్రామానికి చెందిన షేక్ సాహెబ్‌బీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఇంట్లో ఒక్కటే ఉంటుంది. శనివారం బద్వేలులోని తన కుమార్తె ఇంటికి వచ్చిన సమయంలో బోదకొట్టం దగ్ధమవడంతో ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిబూడిదయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వెళ్లేలోపే మొత్తం కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపినట్లు ఫైర్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

14న హుండీ లెక్కింపు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లోని హుండీలను 14న మంగళవారం ఉదయం లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, ఈఓ బీవీ నరసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జగజ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల : రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తుండటం దళిత వర్గాలకు ఎంతో సంతోషంగా ఉందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, జిల్లా అధ్యక్షుడు ఓబయ్య శనివారం ఆదిఆంధ్రపాలెంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం పక్కన బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం కూడా ఏర్పాటు చేస్తే దళిత, గిరిజనులు కూడా ఆనందిస్తారన్నారు.

ఏప్రిల్ 16న మాజీ సైనికుల సంఘం అధ్యక్షుని ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎన్జీఓ హోంలో ఏప్రిల్ 16న ఉదయం 9 గంటలకు ప్రొద్దుటూరు మాజీ సైనికుల సంఘం నూతన అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు సంఘం ప్రస్తుత అధ్యక్షుడు ఎల్.చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాలెట్ పేపర్ ఓటింగ్ ద్వారా అసోసియేషన్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారన్నారు. అసోసియేషన్‌లో మెంబర్‌షిప్ ఉన్న మాజీ సైనికులు, మరణించిన సైనికుల భార్యలు ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 9160372680 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఓటమిని టీడీపీ ముందే ఒప్పుకుంది

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్యే రాచమల్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎన్నికలు జరగనున్న 48 గంటల ముందే టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని పరోక్షంగా అంగీకరించిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా చంద్రబాబు నాయుడు వైఎస్సార్‌సీపీని విమర్శిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లను నమోదు చేసుకున్నారని, అన్యాయానికి, అక్రమాలకు పాల్పడుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు కాని వారిని ఉపాధ్యాయ ఓటర్లుగా, పట్టభద్రులు కాని వారిని పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేయడం సాధ్యమేనా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజల్లో విశ్వాసం లేని కారణంగా ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వస్తుందని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాస్తవానికి తన బలం ఏమిటో టీడీపీ నేతలకు తెలుసునన్నారు. ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌పై విశ్వాసం ఉందని, పట్టభద్రులు, ఉపాధ్యాయులంతా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా తీర్పు ఇస్తారన్నారు.

14 ఏళ్లు చంద్రబాబు పట్టించుకోలేదు

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఏమి చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. దొంగ ఓట్లను నమోదు చేసుకుని ఉంటే మూడు జిల్లాలకు కలిపి ఎందుకు 27వేల ఉపాధ్యాయుల ఓట్లు మాత్రమే ఉన్నాయని అన్నారు. మూడు జిల్లాలకు సంబంధించి సుమారు 70 లక్షల జనాభా ఉండగా కేవలం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లకు సంబంధించి 2లక్షల 75వేలు మాత్రమే ఎందుకు ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలిస్తే దొంగ ఓట్లు, మోసం, అన్యాయాలతో గెలిచిందని చెప్పడానికి, తమ పార్టీ గెలిస్తే 2024 ఎన్నికల్లో 154 సీట్లతో అధికారంలోకి వస్తామని చెప్పడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. పారదర్శంగా ఎన్నికలు జరిపి ప్రజాస్వామ్యాన్ని గెలిపిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు అన్నారు.సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొవ్వూరు రమేష్‌రెడ్డి చారిటబుల్ సొసైటీ సేవలు అభినందనీయం

ప్రొద్దుటూరు క్రైం : కొవ్వూరు చారిటబుల్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో కొవ్వూరు చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను కొవ్వూరు రమేష్‌రెడ్డి మనువడు కొవ్వూరు సుయేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వైద్యులతో పరీక్షలు చేయించుకున్నారు. కొవ్వూరు రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి 11న లివర్, జనరల్‌బాడీ చెక్‌పై మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవయవ దానానికి ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ మెడికల్ క్యాంప్‌లో యశోద ఆస్పత్రి డాక్టర్ ధర్మేష్‌కపూర్, డాక్టర్ వైవీ.భార్గవ్, ప్రియభావన ఆస్పత్రి డాక్టర్ సీహెచ్ ఉమామహేశ్వరరెడ్డి, డాక్టర్ హరిప్రియ పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కొవ్వూరు జయమ్మ, వై.వనజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కడప రాయుని గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మాసోత్సవాల్లో భాగంగా రెండో శనివారాన్ని పురస్కరించుకుని తొలుత మూలమూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు తమ వీధికి తరలివచ్చిన స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్ ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవం.. ప్రసన్న విఘ్నేశ్వర కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం బెల్లమండివీధిలోని శ్రీ ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ సిద్ధి బుద్ధి అమ్మవార్ల సమేతంగా తిరు కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ త్రిపుష్కర సహిత అష్టబంధన మహా కుంబాభిషేకం సందర్భంగా ఈనెల 8 నుంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. తొలుత మూలవర్లకు అభిషేకం జరిపారు. ప్రాతఃకాల పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, అష్టబంధన సమర్పణ, మహాకుంభాభిషేకం, ప్రథమ దర్శన ఘట్టం నిర్వహించారు. అనంతరం వధూవరులుగా అలంకరించిన ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపై ఏర్పాటు చేసి అర్చకులు చంద్రమౌళిశర్మ బృందం కల్యాణ క్రతువును నిర్వహించిది. రాత్రి పల్లకిపై వధూవరులైన దేవతామూర్తులను కొలువుదీర్చి అట్టహాసంగా నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం ఉత్సవాల ముగింపు సందర్భంగా పుష్కయాగం నిర్వహిస్తారు.

శబరిమల ఆలయాన్ని తలపించేలా!



మున్సిపల్ మైదానంలోని అయ్యప్ప ఆలయం (ఫైల్)

కడప కల్చరల్ : కడప నగరంలో స్వామి అయ్యప్పకు నూతన ఆలయం ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. కడప నగరంలో స్వామి అయ్యప్పకు తొలిసారిగా మున్సిపల్ మైదానంలో ఆలయం నిర్మించారు. ఇదే స్థానంలో శబరిగిరిలోని అయ్యప్ప ఆలయాన్ని తలపించేలా అదే నిర్మాణశైలిలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు పనులు ప్రారంభం అయ్యాయి. 1997లో కేరళ నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన అయ్యప్పస్వామి భక్తులు పీకే విశ్వనాథ గురుస్వామి కోరిక మేరకు స్థానిక ప్రముఖులు మున్సిపల్ మైదానంలో ఈ ఆలయాన్ని ఏర్పాటు చేశారు. తొలుత కొద్దిమంది భక్తులు వచ్చేవారు. క్రమంగా భక్తులు, దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందింది. దాదాపు పాతికేళ్లు కావడం, ఆధునిక వసతులు అవసరం కావడంతో కొందరు భక్తులు నూతన ఆలయ నిర్మాణం గురించి ప్రతిపాదన తెచ్చారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా మేడా వెంకట శేషారెడ్డి, ఉపాధ్యక్షులుగా పోతుల వెంకట్రామిరెడ్డిలతో సభ్యులుగా శంకరయ్య, బాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, రాణా ప్రతాప్, రంగరాజు, కరుణాకర్‌రెడ్డి తదితరులతో నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

పనులు ప్రారంభం : 2019లోనే నూతన ఆలయ నిర్మాణానికి ప్రయత్నాలు జరిగాయి. ఇంతలో కరోనా రావడం, పలు మార్పులు చోటుచేసుకోవడంతో మళ్లీ నూతన ఆలయ నిర్మాణం గురించి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అంచనా వ్యయం కూడా మారింది. ప్రస్తుతం శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని పోలినట్లు సన్నిధాన దేవతల ఆలయాలను కూడా అదే ప్రాంగణంలో నిర్మించేందుకు మొత్తం రూ. 5 కోట్లకు పైగా అవసరమవుతుందని అంచనా వేశారు. తొలుత నిర్మాణ కమిటీ సభ్యులు తమవంతు విరాళం ప్రకటించారు. అనంతరం నగరంలోని అయ్యప్ప భక్తులు కూడా ఈ కార్యక్రమానికి సహకారం అందించగలమని హామీ ఇచ్చారు. ప్రధానంగా స్థానిక ధార్మికవేత్త, అయ్యప్ప భక్తుడు మేడా రఘునాథరెడ్డి ఆలయ నిర్మాణంలో తమవంతు తోడ్పాటు అందించేందుకు ముందుకు వచ్చారు. నెలరోజుల కిందట ఆలయ నిర్మాణంలో భాగంగా మూలమూర్తికి అదే ప్రాంగణంలో బాల ఆలయం నిర్మించారు. ఇటీవలే స్వామిని అందులో ప్రతిష్ఠించి నిర్మాణ పనులు ప్రారంభించారు. జిల్లాలో అచ్చం శబరిమల అయ్యప్ప ఆలయాన్ని తలపించేలా 18 మెట్లు, ఉప ఆలయాలతోసహా నిర్మించేందుకు పనులు జోరుగా సాగుతున్నాయి. రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు భావిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జమ్మలమడుగు : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెరపడింది. సోమవారం ఎమ్మెల్సీల ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ఉండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు పోలింగ్ నిర్వహించే కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ తిరుపతయ్య, సీఐ సదాశివయ్యలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేదానిపై రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆదివారం మధ్యాహ్నం నాటికి పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా చేసి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం–ఆర్డీఓ

జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 30 పట్టభద్రులకు మరో 10 ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కేటాయించారు. అత్యధికంగా ప్రొద్దుటూరులో పట్టభద్రులకు 15 కేంద్రాలను, జమ్మలమడుగులో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఓటర్లు ప్రభుత్వం సూచించిన మేరకు గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటింగ్‌లో పాల్గొన వచ్చు అన్నారు.

మండలం	పోలింగ్ కేంద్రాలు (పట్టభద్రుల-ఉపాధ్యాయ)	మొత్తం
జమ్మలమడుగు	4+1	05
మైలవరం	1+1	02
పెద్దముడియం	1+1	02
ముద్దనూరు	1+1	02
కొండాపురం	2+1	03
ఎర్రగుంట్ల	3+1	04
ప్రొద్దుటూరు	15+1	16
రాజుపాళెం	1+1	02
చాపాడు	1+1	02
దువ్వూరు	1+1	02
మొత్తం	30+10	40

రేపు ఖాదర్‌పల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహిస్తోన్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు.

ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం గృహ సందర్శనలో భాగంగా ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి చెప్పారు.

నేడు గంగమ్మకు బోనాలు

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని పాలెంపల్లె వద్దగల రూకవానిపల్లెలో శనివారం శ్రీ గంగమ్మ తల్లి జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జయభారత్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆదివారం ఉదయం 6.00 గంటల నుంచి అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

19న గృహిణులకు వంటల పోటీలు

కడప రూరల్ : కల్లూరీస్ డయాబెటీస్ అండ్ ఒబెసిటీ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదిన గృహిణులకు చిరు ధాన్యాలతో వంట చేసే పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సొసైటీ అధ్యక్షులు కల్లూరి రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి, భారత ప్రభుత్వం సూచించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వంట పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియమ నిబంధనల గురించి తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడపలోని మానస నర్సింగ్ హోం వీధిలో షేక్ మహమ్మద్ హబీబుల్లా నివాసం ఉంటున్నాడు. శనివారం కొండాయపల్లె కాల్వకట్ట వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 18 క్వార్టర్ బాటిళ్ల మద్యం సీజ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



ప్రొద్దుటూరు : సూచనలు చేస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్



చాపాడులోని ఓటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ఈనెల 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ ప్రేరణా కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, ఎద్దుల వెంకటసుబ్బమ్మ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, కొత్తి చిన్నవెంకటసుబ్బయ్య హైస్కూల్, రమణ మహర్షి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు గురించి సీఐలు ఇబ్రహీం, రాజారెడ్డి, నారాయణ యాదవ్‌లకు ఏఎస్పీ ప్రేరణాకుమార్ సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాజుపాళెం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజుపాళెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం సాయంత్రం ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణా కుమార్ పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఎస్ఐ రాజగోపాల్‌కు సూచించారు.

చాపాడులో ఎన్నికలకు సర్వం సిద్ధం

చాపాడు : పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఎన్నికలలో భాగంగా సోమవారం నిర్వహించనున్న ఓటింగ్ కోసం చాపాడులోని జిల్లా జీఏఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 1137 మంది పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉండగా వీరందరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలోని పట్టభద్రుల ఓటర్లు 1071 మంది ఉండగా వీరిలో 740 పురుషులు, 331 మంది మహిళలు ఉన్నారు. వీరందరూ ఓటు వేసేందుకు పదో తరగతి ఏ–సెక్షన్ గదిని, ఇదే క్రమంలో 66 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వీరిలో 40 మంది పురుషులు, 26 మంది మహిళలు ఉన్నారు. వీరు ఓటు వినియోగించుకునేందుకు పదో తరగతి బీ–సెక్షన్ గదిని పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డ తెలిపారు. స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కరస్పాండెంట్లు చెప్పిన సమస్యలను మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆ మేరకు పాఠశాలల రెన్యువల్ సమస్యను, విద్యుత్ చార్జీల సమస్యను, ఖాళీగా ఉన్న మున్సిపల్ స్థలాలను లీజుకు ఇచ్చే విషయంపై చర్చించామన్నారు. మిగతా సమస్యలను కూడా చర్చించి తాను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, అహ్మద్, బాలసుబ్బారెడ్డి, మోహన్‌రావు, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీలంతా వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. శనివారం పట్టభద్రులైన అంగన్‌వాడీలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మట్లాడారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కమిటీ సభ్యురాలు కొండా ధనలక్ష్మి, గుమ్మళ్ల పద్మావతి, నిర్మలాదేవి పాల్గొన్నారు.

శిక్షణా ఫలాలను అందరికీ అందించాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర రిసోర్సు పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులను సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలంటే శిక్షణలో పొందిన ఫలాలను వారికి అందించినప్పుడే సాధ్యమౌతుందని విద్యాశాఖ రాష్ట్ర రిసోర్సు పర్సన్, ఏకలవ్య విద్యా కమిటీ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప బాలాజీనగర్ నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో శనివారం అక్షయ విద్యాకేంద్రాల ట్యూటర్లకు ఒక రోజు పునశ్చరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో పొందిన ఫలాలు, నైపుణ్యాలను అందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టు ప్రతినిధి చలపతి, విద్యా కమిటి అధ్యక్షురాలు బాలకృష్ణ, కో ఆర్డినేటర్ నరేష్‌కుమార్, గిరిరాజు, అకౌంటెట్స్, కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాట వేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులు, తల్లితండ్రులు కలిసి విద్యార్థుల భవిషత్తుకు బంగారుబాట వేయాలని ఎంఈఓ పాలెం నారాయణ అన్నారు. కడప నగరపాలక మెయిన్ పాఠశాలలో హెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ విద్యార్థుల తల్లితండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు కేవలం 20 రోజులు మాత్రమే గడువుందని, తల్లితండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చదువును, ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేక ప్రణాళికకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార పర్వం



27వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి



మైదుకూరు: పట్టభద్రులకు నమూనా బ్యాలెట్ పత్రాలను అందిస్తున్న శశికళ, శేషు



అధ్యాపకులకు నమూనా బ్యాలెట్ అందజేస్తున్న నాగార్జునరెడ్డి

బద్వేలు అర్బన్ : ఈనెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారపర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. శనివారం పట్టణంలో ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. పోరుమామిళ్లరోడ్డులోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించిన అడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డిలు వెన్నపూసకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విశ్రాంత ఉద్యోగులను అభ్యర్థించారు. 19వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి ఓటు అభ్యర్థించారు. 27వ వార్డులో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, 14వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి సరిటాలమాలాలి, 5వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి సింగసాని శివయ్య, యువజన విభాగం నాయకుడు రాజేష్, 23వ వార్డులో వార్డు కౌన్సిలర్ కరీముల్లా ఆధ్వర్యంలో, 1వ వార్డులో వార్డు కౌన్సిలర్ శివకుమారి, ఇన్‌చార్జి ఆవులశ్రీనివాసులు ఆధ్వర్యంలో వెన్నపూసకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

మైదుకూరు : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఇడగొట్టు శశికళ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇడగొట్టు శేషు పట్టభద్రులను కోరారు. శనివారం వారు వనిపెంటలో పట్టభద్రులను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. పట్టభద్రులకు నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేసి ఓటు వేసే విధానాన్ని వివరించారు.

ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయండి

బద్వేలు : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డిలకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. శనివారం ఆయన పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల, శ్రీవెంకటేశ్వర పాఠశాల, వాగ్దేవి, దత్తసాయి జూనియర్ కళాశాలల్లో వారికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, జేకే, బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలి

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వారికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళమెత్తే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులైన కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో నరసింహ, ఓబయ్య పాల్గొన్నారు.

కాశినాయన : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని మండలంలోని చెన్నవరం, రెడ్డికొట్టాల, ఆకులనారాయనపల్లె, వరికుంట్ల, నాయునిపల్లె, గొంటువారిపల్లె, బాలాయపల్లె గ్రామాల్లో శనివారం జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిత్యరెడ్డి, పంగాగురివిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, దుగ్గిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.